క్లుప్తంగా

'విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి అర్బన్: వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అతి జాగ్రత్తగా ఉండి విద్యుత్ సంబంధిత పనులు చేయవద్దని జిల్లా ఎస్ఈ ఎన్.శ్రావణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమం ద్వారా రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. అలాగే విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా 1912 టోల్ ఫ్రీ నంబర్ ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. 1912 నంబర్ అనేది 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సౌజన్య


సౌజన్య


పరమేష్

మద్నూర్: మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సౌజన్య, వైస్ చైర్మన్‌గా పరమేష్ నియమితులయ్యారు. బుధవారం మార్కెట్ నూతన కమిటీ ఎన్నికవ్వడంతో స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు వారికి అభినందనలు తెలియజేశారు. కమిటీ సభ్యులు కుంచెంవార్ అనిల్, సాట్బివార్ రాంగొండ, చౌల్‌వార్ శంకర్, జాదవ్ హరి, పదాంపల్లె హన్మంత్, అహ్మద్, రాంచందర్‌రావు, మాయావతి, ఇబ్రహీం, విఠల్, అశోక్ ఉన్నారు.

బిచ్కుంద ఏఎంసీ చైర్‌పర్సన్‌గా దొడ్ల కవిత



బిచ్కుంద(జుక్కల్): వాజిద్‌నగర్ గ్రామానికి చెందిన దొడ్ల కవితను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని, పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వాజిద్‌నగర్‌కు చెందిన దొడ్ల గోపాల్‌రెడ్డి సేవలను గుర్తించి ఆయన కోడలు దొడ్ల కవితను ఏఎంసీ చైర్మన్‌గా పదవి అప్పగించినట్లు తెలిపారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, గంగాధర్, అశోక్ తదితరులున్నారు.

పాముకాటుకు గురైన కౌన్సిలర్‌కు పరామర్శ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ సాయిలును పాము కాటు వేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే సురేందర్ బుధవారం పరామర్శించారు. అనంతరం మాజీ సర్పంచ్ మహ్మద్ అలీ భార్య, తల్లి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని సైతం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు సతీష్, రాజు, సొసైటీ చైర్మెన్ నర్సింలు తదితరులున్నారు.

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్, వైద్య పరీక్షలు చేశారు. ప్రతిరోజు చిన్నారులకు ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయించాలని సూచించారు. సిబ్బంది వెంకటేశం, తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ డీఈవో రాజుకు బుధవారం వినతి పత్రం అందజేసినట్లు పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు తెలిపారు. పాఠశాలలు, ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు.

మాయమవుతున్న గుట్టలు

- గుట్టలు పంచుకుంటున్న మొరం మాఫియా
- నిత్యం వందలాది టిప్పర్లలో తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


బోర్లం శివారులో..


సోమేశ్వర్ శివారులో టిప్పర్లలో తరలిస్తున్న మొరం

బాన్సువాడ: ప్రకృతికి నిలయాలైన గుట్టలు మాయమవుతున్నాయి. మొరం మాఫియా గుట్టలను పంచుకుని దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో మొరం దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. బాన్సువాడ సమీపంలోని సోమేశ్వర్ గుట్టలు అంటే ప్రకృతికి నిలయాలుగా ఉండేవి. చుట్టూ గుట్టలు.. గుట్టల మధ్యలో సోమలింగేశ్వర ఆలయం, గుట్టల చుట్టూ పచ్చని పంట పొలాలు ఉండేవి. నేడు ఎటూ చూసినా మొరం తవ్వకాలతో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ గుట్టలో నేను తవ్వుకుంటా..ఆ గుట్ట నువ్వు తవ్వుకో అనే విధంగా మాఫియా చెలరేగిపోతోంది. అందుకు బుధవారం సోమేశ్వర్ గుట్ట వద్ద మొరం మాఫియా రహస్యంగా చర్చలు జరుపుకున్నట్లు తెలిసింది. సెలవు రోజుల్లో అయితే ఈ మాఫియాకు అడ్డే లేకుండా పోతుంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తవ్వకాలు జరుపుతున్నారు. ఏ ఒక్కరూ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. అధికారుల కళ్ల ముందు నుంచే మొరం టిప్పర్లు వెళ్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తవ్వకాలపై రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తా


చిట్యాలలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్


మాజీ మంత్రి గీతారెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలిస్తూ..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. బుధవారం ఆయన చిట్యాలలో కరెంటు సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. సబ్ స్టేషన్ ఏర్పాటైతే మండలంలోని చిట్యాల, సంతాయిపేట్, అన్నారం, అన్నారంతాండా, సోమారం, సోమారం తండాలకు నాణ్యమైన కరెంటును సరఫరా చేయవచ్చన్నారు. అంతకు ముందు సోమారం గ్రామంలో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి, ఉపాధ్యక్షులు శివాజీ, లక్ష్మణచారి, తదితరులున్నారు.

ఈశ్వరీబాయి విగ్రహ ఏర్పాటుకు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై ఎల్లారెడ్డి దివంగత మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీబాయి విగ్రహ ఏర్పాటుకు మాజీ మంత్రి గీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో కలిసి స్థల పరిశీలన చేశారు. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, తదితరులున్నారు.

22వ ప్యాకేజీ పనులపై అధికారులతో సమావేశం

ఎల్లారెడ్డి: 22వ ప్యాకేజీ పనులకు సంబంధించి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు సంబంధించిన డిజైన్‌ను పరిశీలించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని 2వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. టీయూఎఫ్ఐడీసీ ప్రత్యేక నిధులతో కాలనీలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, కౌన్సిలర్ మహేశ్వరి, కాంగ్రెస్ నాయకులున్నారు. అలాగే మండల పరిధిలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

రాష్ట్ర స్థాయి హై జంప్ పోటీలకు రాజంపేట విద్యార్థిని ఎంపిక


ఉపాధ్యాయులతో బండారి శ్రీవల్లిక

రాజంపేట: ఖమ్మంలో రేపు జరిగే అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీలకు రాజంపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బండారి శ్రీవల్లిక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ లక్ష్మి తెలిపారు. హైజంప్‌లో అండర్–14 విభాగంలో శ్రీవల్లిక పోటీ పడనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, త్రివేణి, శోభ, కవిత, విజయనిర్మల పాల్గొన్నారు.


తృతీయ స్థానం సాధించిన గిద్ద విద్యార్థులు

నృత్య ప్రదర్శనలో తృతీయ స్థానం

రామారెడ్డి: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర స్థాయి తెలంగాణ సంగీత సాహిత్య, నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో జెడ్పీహెచ్ఎస్(గిద్ద) విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. గిద్ద పాఠశాల హెచ్ఎం కన్నయ్య నృత్య ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, రాజేశ్వర్, భూమేష్, తదితరులున్నారు.

రైస్ మిల్లర్ల నిబంధనలపై ఆగ్రహం

నిజాంసాగర్(జుక్కల్): ధాన్యం బస్తాల తరలింపు, రైస్ మిల్లర్ల నిబంధనల విషయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో వరిధాన్యం తూకాలు, రైస్ మిల్లుల్లో తరుగుతీతపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్పందించి స్థానిక అధికారులతో చర్చించారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఎమ్మెల్యే సూచన మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సవాయిసింగ్ కొమలంచ గ్రామ కొనుగోలు కేంద్రానికి వచ్చారు. అధికారులతో మాట్లాడారు. రైస్ మిల్లు యజమానులతో మాట్లాడి లారీలను అన్‌లోడ్ చేయించారు. నాయకులు నాగభూషణం గౌడ్, ఖలీక్ తదితరులున్నారు.


వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రతి బీజేపీ నేత 100 సభ్యత్వాలు చేయించాలి


మాట్లాడుతున్న బీజేపీ నేత నరేందర్‌రెడ్డి

దోమకొండ: ప్రతి బీజేపీ నాయకుడు 100 సభ్యత్వాలు చేయించి క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండు నెలలుగా చేస్తున్న సభ్యత్వ నమోదు తుది దశకు చేరుకుందని తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా 100 ప్రాథమిక సభ్యత్వాలు చేసిన పార్టీ నేతలు క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారికి మాత్రమే పార్టీ బాధ్యతలు ఇస్తారని అన్నారు. ఈనెల 15 అనంతరం దేశవ్యాప్తంగా బూత్ కమిటీల ఎన్నికలుంటాయన్నారు. నాయకులు జగదీష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, తదితరులున్నారు.

అరెస్ట్ చేసిన గిరిజనులను విడుదల చేయాలి



రాజంపేట: అర్ధరాత్రి అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాజంపేటలో ఆయన మాట్లాడారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అమాయక గిరిజనులను అధికారుల మీదకు ఉసిగొలిపి అరెస్టయ్యే విధంగా చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేని వెంటనే శిక్షించి గిరిజనులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మదన్‌లాల్, లాల్ సింగ్ మంగ్య పాల్గొన్నారు.

'క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది'



బాన్సువాడ రూరల్: విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల శరీర ధృడత్వం పెరగడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇంటర్మీడియేట్ కామారెడ్డి జిల్లా అధికారి షేక్ సలామ్ అన్నారు. బుధవారం ఆయన బోర్లంక్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోనల్ స్పోర్ట్స్‌ను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి తూకం వేసిన వివరాలు, ట్యాబ్‌లో నమోదు చేసిన వివరాలు సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏఈవో మధుసూదన్, కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

జుక్కల్‌లో విద్యా సంస్థల బంద్



నిజాంసాగర్(జుక్కల్): బాసర ట్రిపుల్ ఐటీ విద్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న స్వాతి ప్రియ మృతికి సంతాపంగా బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో విద్యాసంస్థలను మూసివేయించి బంద్ పాటించారు. ఏబీవీపీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఏబీవీపీ కార్యకర్త మారుతి, ప్రసాద్, సచిన్, ఆకాంక్ష, సౌజన్య, శృతి, తదితరులున్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి

బాన్సువాడ: ఇళ్లు నిర్మిస్తామని తమ ఇళ్లు గతేడాది కూలగొట్టి ఇప్పటి వరకు నిర్మించి ఇవ్వలేదని, వెంటనే తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బుధవారం బాధితులు బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పట్టణంలోని పాత బాన్సువాడ దళితవాడలో గత ఏడాది 106 ఇళ్లను కూలగొట్టి వాటి స్థానంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి సగం మందికే ఇళ్లు కట్టించి మిగత 56 మందికి ఇప్పటి వరకు ఇళ్లు కట్టించలేదని వాపోయారు. ప్రభుత్వం అమలు చేసే ఇందిరమ్మ పథకం కింద తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.


వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సాక్షి నెట్‌వర్క్: కామారెడ్డి నియోజకవర్గంలోని 289 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. బుధవారం ఆయా మండలాల్లో ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, రామారెడ్డి మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విత్తన నమూనాల సేకరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విత్తన విక్రయ దుకాణాల నుంచి బుధవారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ విత్తన నమూనాలను సేకరించారు. యాసంగిలో రైతులకు విక్రయించడానికి నిల్వ ఉంచిన ధాన్యం విత్తనాలు నమూనాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన కంపెనీ వివరాలు, ధాన్యం రకాలు పరిశీలించారు. పరీక్షల నిమిత్తం విత్తనాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా తులసి నారాయణుల కల్యాణోత్సవం



కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి శివారులోని సాయి ప్రేమ మందిరంలో బుధవారం కార్తీకమాస క్షీరాబ్ది ద్వాదశి పుణ్యతిథిని పురస్కరించుకుని తులసీ బృంద సహిత ధాత్రి నారాయణ కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. సుహాసినీలతో తులసి పూజలు చేపట్టారు. దీపాలు వెలిగించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం కార్తీక ఉసిరి వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ఆవరణలో దాండియా ఆడారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు మంజుల–విజయ్‌కుమార్ దంపతులు, కమిటీ ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు కోట దుర్గమ్మ ఆలయంలో కార్తీక దీపోత్సవం

బాన్సువాడ: బాన్సువాడ కోట దుర్గమ్మ ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని కోట దుర్గమ్మ ఆలయంలో సాయంత్రం శివాభిషేకం, దీపాలంకరణ, దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి చిలుకుపూజ



కామారెడ్డి రూరల్/కామారెడ్డిఅర్బన్: లింగాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా చిలుకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తులసి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజుల్లో దీపం వెలిగిస్తే ఎక్కువ ఫలితాలను ఇస్తాయని ఆలయ అర్చకుడు రవికాంత్ ఈ సందర్భంగా తెలిపారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతీ మాత ఆలయంలో 11వ రోజు కార్తీక బుధవారం సందర్భంగా భక్తులు ఆకాశ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ, విజయపాండేల ఆధ్వర్యంలో ఆకాశ కార్తీక దీపంను వేద మంత్రోచ్చరణముల మధ్య వెలిగించారు. అనంతరం అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్టీ విఠల్ పటేల్, కోలాల సిద్ధాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి విఠలేశ్వరుడి ఆలయంలో..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక ద్వాదశిని పురస్కరించుకుని ఆలయంలో విఠలేశ్వరుడికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేసి కాకడ హారతి ఇచ్చారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రామ్ మందిర్‌లో మంగళవారం రాత్రి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ప్రఖండ ప్రముఖ్ పాల్గొని హనుమంతుని గురించి వివరించారు. మండల కేంద్రంలోని పుర ప్రముఖులు, పిల్లలు, మహిళలు హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు.

సంక్షిప్తం

కొక్కొండలో విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఎల్లారెడ్డిరూరల్: కొక్కొండ గ్రామంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్: కామారెడ్డిలో ఈ నెల 18న జరిగే మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎల్లారెడ్డిలో భవన నిర్మాణ రంగ కార్మికులు బుధవారం ఆవిష్కరించారు. మహాసభకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

విద్యా మహాసభల పోస్టర్లు..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు మహా సభలు ఉంటాయని సంఘం మండల అధ్యక్షుడు దేవిసింగ్ తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి బీంరావు ఉన్నారు.

ఓపెన్ యూనివర్సిటీలో నాణ్యమైన విద్య



కామారెడ్డి అర్బన్: ఎడ్యుకేషన్ ఎట్ యువర్ డోర్‌స్టెప్ నినాదంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 40 ఏళ్లుగా లక్షలాది మందికి నాణ్యమైన డిగ్రీ, పీజీ విద్యను అందిస్తోందని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ కామారెడ్డి స్టడీ సెంటర్ సమన్వయకర్త ఆకుల సుధాకర్ అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సిబ్బంది ఎల్.బాపురావు, రమేశ్‌లతో కలిసి బుధవారం యూనివర్శిటీ పోస్టర్లను ఆవిష్కరించారు. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 15 చివరి తేదని అన్నారు. ప్రవేశాల వివరాలకు 73829 29695 నంబర్‌ను సంప్రదించాలని సమన్వయకర్త సుధాకర్ కోరారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి అనిల్ రెడ్డి సూచించారు. బుదవారం ఆరేపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆవులు, గేదెలు, ఇతర పశువులు గర్భం దాల్చకపోతే వాటిని పరీక్షించి తగిన చికిత్స అందిస్తున్నామని, లింగనిర్ధారణ, వీర్యం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. డాక్టర్ అబ్దుల్ మాజిద్, రాంచందర్, డీఎల్‌ఏ సూపర్వైజర్ కృష్ణ, దితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899